# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-05-2024    సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విద్యార్థులు మంచి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు.
- ❖ రాష్ట్రంలో పోలింగ్ రోజున ఈవీఎంలు ధ్వంసం చేసిన నిందుతుల వివరాలను సిట్ కు అందించామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు.
- ❖ నూతన నేర చట్టాలపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ రోజు విశాఖలో అవగాహన సదస్సు నిర్వహించారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ లో త్వరలో  ఏర్పడే ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నానని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు.
- ❖ జీవవైవిద్యాన్ని ఒక సంపదగా భావితరాలకు అందించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి పిలుపునిచ్చారు.

========================

విద్యార్థులు మంచి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఈ రోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సులలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ... భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కని వాటిని సాకారం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు వీలవుతుందని.. విశ్వవిద్యాలయంలోని వనరులను వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని గవర్నర్ ఆకాంక్షించారు.

========================

నూతన నేర చట్టాలపై ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో ఈ రోజు విశాఖపట్నంలో "వార్తా లాప్" అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఈ. దామోదర్, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నందిని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ... ఇటీవల ఆమోదం పొందిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాల ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలియజేశారు. సాంకేతిక పరమైన సాక్ష్యాలకు సంబంధించి ఈ చట్టాల్లో కీలకమైన మార్పులు చేశారని వెల్లడించారు. ఈ నేర చట్టాలు జులై 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఈరోజు ఉదయం తిరుమల శ్రీ వేంక శ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో త్వరలో ఏర్పడే ప్రభుత్వంతో సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా ప్రార్థించానని, స్వామి వారి ఆశీస్సులతో ఉభయ తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జీవవైవిధ్యాన్ని ఒక సంపదగా భావితరాలకు అందించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి పిలుపునిచ్చారు. ఈరోజు విశాఖపట్నంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి చౌదరి మాట్లాడుతూ, వాతావరణ మార్పులకు కారణం మానవ తప్పిదాలేనని ఉద్ఘాటించారు. ప్రకృతి వనరుల పరిరక్షణ, జీవవైవిధ్య ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలని ఆయన పేర్కొంటూ.....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు పరిసర ప్రాంతంలో ఆవరించి ఉన్న ఉపరితల ఆవర్తనం కారణంగా ఈరోజు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం ఉదయానికి వాయుగుండంగా మారే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అల్పపీడనం ఏర్పడిన తర్వాత పొడి వాతావరణం కారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణం కేంద్రం హెచ్చరించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఈనెల 13వ తేదీ పోలింగ్ రోజున 9 చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేశారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. అమరావతిలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పల్నాడు జిల్లా మాచర్లలోనే 7 ఘటనలు చోటుచేసుకున్నాయని, ఈ ఘటనలన్నింటిని వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించామన్నారు. నిందితుల వివరాలు సిట్‌కు అందించామని ఆయన తెలియజేశారు. మే 20న రెంటచింతల ఎస్.ఐ. కోర్టులో మెమో దాఖలు చేశారని, అందులో మొదటి నిందితుడిగా పిన్నెల్లి రామకృష్ణ రెడ్డిని పేర్కొన్నారు. 10 సెక్షన్ల కింద ఆయనపై కేసులు పెట్టారని, ఏడేళ్ల వరకూ శిక్షలు పడే అవకాశం ఉందని ఆయన అన్నారు. మిగతా చోట్ల కూడా కేసులు పెట్టి దర్యాప్తు చేస్తున్నారని, ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదని ముఖేశ్ కుమార్ మీనా హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాణ సమయంలో తలెత్తే ఎలాంటి సాంకేతిక సమస్యనైనా త్వరితగతిన పరిష్కరించే సమర్థత వాల్తేర్ డివిజన్ సిబ్బందికి వుందని డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లోని ఈరోజు ఎం-1, డి-1 కోచ్‌లలో సాంకేతిక లోపాన్ని గుర్తించి వాటి స్థానంలో వేరే కోచ్‌లను మార్చి గమ్యస్థానానికి పంపించడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా విశాఖపట్నంలో ఈరోజు రాత్రి 8 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం - నాందేడ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ గంటన్నర ఆలస్యంగా అంటే రాత్రి 9 గంటల 30 నిమిషాలకు బయలుదేరుతుందని రైల్వే అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలియజేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కేసులు పెడతామని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలోని పూతలపట్టు, తవణంపల్లి మండలాల పరిధిలో ప్రభుత్వంచే గుర్తించిన ఇసుక రీచ్ ను ఈరోజు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిర్మాణాలకు ఇసుక తీసుకెళుతుంటే ఖచ్చితంగా అనుమతి ఉండాలని, అక్రమంగా ఇసుక తరలిస్తుంటే వారిపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. వాగులు, వంకలు, నదులలో చెత్త వేయనీకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ సెక్రటరీలు, విఆర్ ఓలు, వి.ఆర్.ఏలపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) రెండవ జోన్ కార్యాలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన మధురవాడ జోన్-2 కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యాలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఐటి సెజ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఐటి సెజ్ పార్కును సందర్శించి పార్కులోని పెండింగ్ పనులను, టెన్నిస్ కోర్టు పార్కు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గర్భిణులలో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గర్భిణులలో రక్తహీనత, ప్రసవ మరణాలు, తల్లిబిడ్డల నమోదు, ఆసుపత్రి ప్రసవాలు, కంటి వెలుగు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం రక్తహీనత గల గర్భిణీ స్త్రీలకు అందించిన సేవలపై సమీక్ష నిర్వహించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 24వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్, ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు, డీఈఈసెట్ నిర్వహణపై కలెక్ట్ రేట్ లో ఈరోజు సమీక్షించారు. పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరగకండా ఎంపిడిఓలు, తహసీల్దార్లతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో భాగంగా ఈరోజు అహ్మదాబాద్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ లో విజయం సాధించిన జట్టు ఈనెల 24న జరగనున్న క్వాలిఫర్-2 మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుతో పోటీ పడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =